సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా

గురువారం । 12 । సెప్టెంబర్ । 2024



టన్ను చీనీ రూ.20 వేలు
అనంతపురం వ్యవసాయ మార్కెట్‌యార్డులో బుధవారం టన్ను చీనీకాయలు గరిష్టంగా రూ.20 వేలు, కనిష్టంగా రూ.10 వేల ప్రకారం పలికాయి.



టమాట కిలో రూ.26
అనంతపురం శివారు కక్కలపల్లి మండీలో బుధవారం కిలో టమాట గరిష్టంగా రూ.26, కనిష్టంగా రూ.14 ప్రకారం ధర పలికింది.

గరిష్టం/కనిష్టం
35.7°/23.6°

జిల్లా పరిధిలో బుధవారం పగటి, రాత్రి ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. సాయంత్రం ఆకాశం పాక్షికంగా మేఘావృతమైంది. గంటకు 6 నుంచి 10 కి.మీ వేగంతో నైరుతి దిశగా గాలి వీచింది.

న్యూస్‌రీల్

విద్యార్థులపై విషద్రావకం
- 10 మంది విద్యార్థులకు అస్వస్థత


చికిత్స కోసం ఆస్పత్రికి వచ్చిన విద్యార్థులు

సోమందేపల్లి: స్థానిక సాయినగర్‌లోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలోని విద్యార్థులపై మరో పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు విషద్రావకం చల్లి పరారయ్యారు. స్థానికంగా కలకలం రేపిన ఈ ఘటన బుధవారం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే.. మధ్యాహ్న భోజనం విరామం అనంతరం మరో పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు సాయినగర్‌లోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలోకి ప్రవేశించారు. ఆవరణలో ఉన్న ఒకటవ తరగతి విద్యార్థులపై వెంట తెచ్చుకున్న విషద్రావకాన్ని చల్లారు. దీంతో కళ్లు మండి విద్యార్థులు గట్టిగా కేకలు వేయడంతో అక్కడే ఉన్న హెచ్‌ఎం సంజీవ రాయుడు ఇద్దరినీ పట్టుకునేందుకు ప్రయత్నించగా, వారు గోడ దూకి పరారయ్యారు. ఈ ఘటనలో 10 మంది విద్యార్థులు అస్వస్థతకు గురికాగా, విషయం తెలుసుకుని పాఠశాల వద్దకు చేరుకున్న తల్లిదండ్రులు చిన్నారులను స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకువెళ్లి చికిత్స చేయించారు. ఈ ఘటనపై ఎస్‌ఐ రమేష్ బాబు విచారణ చేపట్టారు.

పార్ట్‌టైమ్ టీచర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు

అనంతపురం ఎడ్యుకేషన్: ఉమ్మడి అనంతపురం జిల్లాలోని సాంఘిక సంక్షేమ గురుకులాల్లో ఖాళీగా ఉన్న టీచర్ల పోస్టులను పార్ట్‌టైమ్ పద్ధతిలో భర్తీ చేయనున్నట్లు గురుకులాల కోఆర్డినేటర్ మురళీకృష్ణ తెలిపారు. ఈనెల 17న ఉదయం 11 గంటలకు కురుగుంట గురుకుల పాఠశాలలో జరిగే డెమో/వాక్ ఇన్ ఇంటర్వ్యూకు హాజరుకావాలన్నారు. జూనియర్ లెక్చరర్, పీజీటీ పోస్టులకు పీజీ, బీఈడీ, టెట్ అర్హత, టీజీటీ పోస్టులకు డిగ్రీ, బీఈడీ, టెట్ అర్హత (టీజీటీ హిందీకి పీజీ కూడా ఉండాలి), పీఈటీ పోస్టులకు బీపీఈడీ, టెట్ క్వాలిఫై, హెల్త్ సూపర్‌వైజర్ పోస్టులకు బీఎస్సీ నర్సింగ్ అర్హతలు ఉండాలని వెల్లడించారు.

వినాయకా.. సెలవిక

చిన్నా, పెద్దా తేడా లేదు. ఆడ, మగ లింగబేధం కనిపించలేదు. అందరినోట 'జై గణేశ్ మహరాజ్‌కి' అన్న నినాదమే. అందరిలోనూ భక్తి భావమే. గణేశ్ నిమజ్జనం సందర్భంగా బుధవారం కదిరిలో మత సామరస్యం వెల్లివిరిసింది. వినాయక శోభయాత్రతో పట్టణం జన సాగరాన్ని తలపించింది. చవితిరోజున మంటపాల్లో కొలువుదీరి ఐదురోజులు పూజలందుకున్న గణనాయకుడిని బుధవారం భక్తిశ్రద్ధలతో గంగఒడికి చేర్చారు. శోభయాత్రలో యువత రంగులు చల్లుకుంటూ నృత్యాలు చేస్తూ సందడి చేశారు.


కదిరి: శోభయాత్రలో ఎర్రకోట వినాయకుడి ముందు యువత కేరింతలు

- కోలాహలంగా గణేశ్ నిమజ్జనం
- ఉరకలేసిన యువత ఉత్సాహం
- పర్యవేక్షించిన ఎస్పీ వి.రత్న

కదిరి: 'జై జై గణేశ..జై కొట్టు గణేశ..బైబై గణేశా.. వినాయక సెలవిక' అంటూ కదిరి వీధులు మార్మోగాయి. చవితి రోజున కొలువుదీరి పూజలందుకున్న బొజ్జ గణపయ్యకు జనం ఘన వీడ్కోలు పలికారు. పట్టణంలో బుధవారం జరిగిన గణేశ్ నిమజ్జనం భక్తుల కోలాహలం మధ్య భక్తి భావంతో ప్రశాంతంగా జరిగింది. వీధివీధిలో కొలువు దీరిన ఏకదంతునికి మంటపాల వద్ద నిర్వాహకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం గణేశుడు కొలువు దీరిన వాహనాలన్నీ స్థానిక రైల్వే స్టేషన్ వద్దకు చేరుకున్నాయి. నృసింహాలయం వద్ద ఏర్పాటు చేసిన విగ్రహానికి ప్రత్యేక పూజల అనంతరం అర్చకులు నిర్ణయించిన శుభ ఘడియల్లో వివిధ రాజకీయ పార్టీల నాయకులతో పాటు మత పెద్దలు రథం లాగి శోభ యాత్రను ప్రారంభించారు. గతంలో హిందూ, ముస్లిం పెద్దలు అధికారుల సమక్షంలో చేసుకున్న ఒప్పందం ప్రకారం సింహకోట, ఎర్రకోట, శివాలయం, రైల్వే గణేష్ వినాయకులను మాత్రమే ఆలంఖాన్‌వలి మసీదు ముందు దారిగుండా తీసుకెళ్లారు. మిగిలిన విగ్రహాలన్నీ హిందూపూర్ సర్కిల్ మీదుగా రామనారాయణ కుంట వరకూ తీసుకువెళ్లి నిమజ్జనం చేశారు. ఎస్పీ వి.రత్న దగ్గరుండి నిమజ్జనం బందోబస్తు ఏర్పాట్లను పర్యవేక్షించారు. సుమారు 400 మంది దాకా పోలీసులు బందోబస్తు విధుల్లో పాల్గొన్నట్లు ఎస్పీ తెలిపారు. పట్టణంలోని వేమారెడ్డి కూడలిలో పూల వ్యాపారులు భక్తులకు అన్నదానం చేశారు.

అనుభవం నేర్పని పాఠాలు

వినాయక శోభయాత్రలో అర్ధరాత్రి దాటినా పట్టణం దాటలేదు. దీనికి తోడు పట్టణంలో కరెంటు కోత విధించడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. సూర్యాస్తమయంలోపు విగ్రహాలన్నీ కోనేరు సర్కిల్ దాటి పోవాలని ఏటా అధికారులు చెబుతున్నా.. ఎప్పుడూ ఆచరణలో మాత్రం సాధ్యం కాలేదు. ఈ సారి కూడా అదే పరిస్థితి నెలకొంది. ఇక నిమజ్జనం ప్రశాంతంగా సాగేందుకు సహకరించిన పట్టణ ప్రజలకు డీఎస్పీ శ్రీలత ధన్యవాదాలు తెలిపారు.


రామనారాయణ కుంటలో గణేశుడి నిమజ్జనం


శోభయాత్రలో శివాలయం గణనాథుడు


పురవీధుల గుండా వెళుతున్న నృసింహాలయ గణేశుడు


శోభయాత్రలో సందడి చేస్తున్న యువత


వేమారెడ్డి కూడలిలో అన్నదానం చేస్తున్న పూల వ్యాపారులు


నిమజ్జనానికి వెళుతున్న సింహకోట గణేష్


బందోబస్త్‌ను పర్యవేక్షిస్తున్న జిల్లా ఎస్పీ రత్న



వినాయక శోభయాత్రలో నృత్యాలు చేస్తున్న యువత

రాష్ట్రంలో రౌడీ రాజ్యం


ఆస్పత్రిలో బాధితున్ని పరామర్శిస్తున్న ఉషశ్రీచరణ్, టీఎన్ దీపిక


హిందూపురం అంబేద్కర్ సర్కిల్‌లో బైఠాయించిన ఉషశ్రీచరణ్, టీఎన్ దీపిక, వైఎస్సార్‌సీపీ నాయకులు

- రెడ్‌బుక్ పేరుతో హింసాత్మక పాలన
- వైఎస్సార్ సీపీ నేత శివశంకర్‌రెడ్డి, అతని కుటుంబంపై దాడి దుర్మార్గం
- దౌర్జన్యాలను ఎదుర్కొంటాం
- కార్యకర్తలకు, ప్రజలకు అండగా ఉంటాం
- వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీ చరణ్, పార్టీ నేత టీఎన్ దీపిక
- నిందితులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ అంబేడ్కర్ సర్కిల్‌లో ధర్నా

హిందూపురం: ''రాష్ట్రంలో రౌడీ రాజ్యం నడుస్తోంది. రెడ్‌బుక్ పేరుతో హింసాత్మక పాలన సాగుతోంది. ప్రజాస్వామ్యంలో ఇది ఎంతమాత్రం మంచి పద్ధతి కాదు. అధికారంలో ఉన్న వారు అందరికీ రక్షణ కల్పించాలి. న్యాయం చేయాలి. అంతేకాని ఇలా భౌతికదాడులను ప్రోత్సహించడం తగదు. టీడీపీ నాయకుల దౌర్జన్యాలు, దుర్మార్గాలపై పోరాడతాం. ప్రజలకు, కార్యకర్తలకు అండగా ఉంటాం'' అని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షురాలు, మాజీ మంత్రి ఉషశ్రీ చరణ్ అన్నారు. బుధవారం ఆమె హిందూపురంలో పర్యటించారు. పార్టీ హిందూపురం సమన్వయకర్త టీఎన్ దీపికతో కలిసి జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి వెళ్లారు. టీడీపీ నాయకుల దాడిలో గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న కొల్లకుంట గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ నియోజకవర్గ పోలింగ్ బూత్ ఇన్‌చార్జ్, జేసీఎస్ పట్టణ కన్వీనర్ శివశంకర్‌రెడ్డిని, ఆయన కుటుంబీకులను పరామర్శించారు. దాడి పూర్వాపరాలను బాధితులను అడిగి తెలుసుకున్నారు. ధైర్యం చెప్పి..తామంతా అండగా ఉంటామని హామీ ఇచ్చారు.

అంబేడ్కర్ సర్కిల్‌లో బైఠాయింపు

వైఎస్సార్ సీపీ నియోజకవర్గ పోలింగ్ బూత్ ఇన్‌చార్జ్, జేసీఎస్ పట్టణ కన్వీనర్ శివశంకర్‌రెడ్డి, ఆయన కుటుంబీకులపై దాడి చేసిన టీడీపీ నాయకులను కఠిన శిక్షించాలని డిమాండ్ చేస్తూ వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షురాలు, మాజీ మంత్రి ఉషశ్రీచరణ్, పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త టీఎన్ దీపిక పార్టీ శ్రేణులతో కలిసి అంబేడ్కర్ సర్కిల్‌లో బైఠాయించారు. వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ నాయకులు గుడ్డంపల్లి వేణురెడ్డి, మాజీ సమన్వయకర్త కొండూరు వేణుగోపాల్‌రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్లు జబివుల్లా, బలరామిరెడ్డి, కౌన్సిలర్లు, నాయకులు కార్యకర్తలు 'వుయ్ వాంట్ జస్టిస్'.. 'నిందితులను వెంటనే అరెస్టు చేసి శిక్షించాలి' అంటూ నినదించారు. అక్కడికి చేరుకున్న సీఐలు రాజగోపాల్ నాయుడు, అంజనేయులు వైఎస్సార్ సీపీ నాయకులతో మాట్లాడి పోలీసుస్టేషన్ పిలిపించారు. దీంతో పార్టీ జిల్లా అధ్యక్షురాలితోపాటు నాయకులు నేరుగా పోలీసుస్టేషన్ వెళ్లి సీఐలతో మాట్లాడారు.

బాధితులపై కేసులు..దుర్మార్గం

టీడీపీ నాయకుల దాడిలో గాయపడి ఆస్పత్రిలో ఉన్న వైఎస్సార్ సీపీ నాయకుడు శివశంకర్‌రెడ్డి, అతని కుటుంబీకులపైనే పోలీసులు దాడి చేయడం దుర్మార్గమని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షులు ఉషాశ్రీ చరణ్ మండిపడ్డారు. పోలీసులు కూడా అధికార పార్టీకి మద్దతు తెలపడం సరైంది కాదన్నారు. పోలీసు స్టేషన్ ఆవరణలో ఉషశ్రీచరణ్, టీఎన్ దీపిక మీడియాతో మాట్లాడారు. టీడీపీ నేతలు శివశంకర్ కుటుంబాన్ని టార్గెట్ చేసి మరీ విచక్షణా రహితంగా దాడులు చేశారన్నారు. చివరకు అంబులెన్స్‌ను కూడా గ్రామానికి రానివ్వకుండా అడ్డుకున్నారన్నారు. బాధితులు ఆస్పత్రికి వెళ్లగా వైద్యులు కూడా టీడీపీ నేతల ఒత్తిళ్లతో ప్రాథమిక చికిత్స చేసి ఇంటికి వెళ్లండని చెప్పడం దారుణమన్నారు. న్యాయం కోసం తాము ధర్నా చేస్తుంటే వన్ టౌన్ సీఐ వచ్చి అడ్డుకున్నారన్నారు. అధికారంలో ఉన్నవారు ప్రజాసంక్షేమం, అభివృద్ధిపై దృష్టి సారించాలని, ఇలా దాడులు చేస్తూ భయభ్రాంతులు సృష్టించడం సరికాదన్నారు. వీటిని కట్టడి చేయాల్సిన బాధ్యత ఎమ్మెల్యే బాలకృష్ణపై ఉందన్నారు. శివశంకర్‌రెడ్డి కుటుంబానికి ప్రాణహాని ఉందని, ఆయనకు, కుటుంబీకులకు ఏదైనా హాని జరిగితే పోలీసులే బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు ఎవరూ భయపడ వద్దని, పార్టీ అండగా ఉంటుందన్నారు.

దాడులు మంచిపద్ధతి కాదు

టీఎన్ దీపిక మాట్లాడుతూ, శివశంకర్‌రెడ్డి కుటుంబంపై జరిగిన దాడి ప్రజాస్వామ్య వాదులంతా ఖండించాలన్నారు. హిందూపురం శాంతిపురంగా ఉందని, ఇక్కడ అశాంతి చెలరేగకుండా అందరం కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. పోలీసులు కూడా బాధిత కుటుంబంపై కేసులు నమోదు చేయడం అన్యాయమన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు కొటిపి హనుమంతరెడ్డి, మన్సూర్, శ్రీంరెడ్డి, శివ, ఆసీఫ్‌వుల్లా, షాజియా, ముస్తక్, రామచంద్ర, ప్రశాంత్, లాయర్ వెంకట రెడ్డి, లక్ష్మీనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

ఇంకా ఆ జిల్లాలోనే ఉన్నారా?


అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న కలెక్టర్ టీఎస్ చేతన్


ఓడీచెరువు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని మందులను పరిశీలిస్తున్న కలెక్టర్ చేతన్

- అధికారులపై కలెక్టర్ చేతన్ ఆగ్రహం
- చెత్త సంపద కేంద్రంపై జిల్లా పేరు మార్చకపోవడంపై మండిపాటు
- నిర్వహణపై సరిగాలేక పోవడంతో ముగ్గురు అధికారులకు మెమోలు

అమడగూరు: ''శ్రీసత్యసాయి జిల్లా ఆవిర్భవించి రెండేళ్లు దాటిపోయింది. అయినా అధికారులు ఇంకా అనంతపురం జిల్లాలోనే ఉన్నట్లు భావిస్తున్నారు. అందుకే చెత్త నుంచి సంపద తయారీ కేంద్రానికి ఇంకా అనంతపురం జిల్లా అనే ఉంది. ఇది సరైన పనేనా.. కనీసం జిల్లా పేరు మార్చే తీరిక లేదా'' అంటూ కలెక్టర్ టీఎస్ చేతన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం ఆయన అమడగూరు బస్టాండు సమీపంలో నిర్మించిన చెత్త నుంచి సంపద కేంద్రాన్ని తనిఖీ చేశారు. అయితే కేంద్రాన్ని సరిగా వినియోగించకపోవడాన్ని గుర్తించి అధికారులపై మండిపడ్డారు. కేంద్రం నిర్వహణను పట్టించుకోని డీఎల్‌పీఓ, ఎంపీడీఓ, పంచాయతీ కార్యదర్శికి మెమోలు జారీ చేయాలని డీపీఓకు ఆదేశాలిచ్చారు. అనంతరం అమడగూరు గ్రామ సచివాలయాన్ని తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. సచివాలయ ఉద్యోగులంతా రోజూ సాయంత్రం 3 నుంచి 5 గంటల వరకూ ప్రజల నుంచి అర్జీలను స్వీకరించి వాటిని పరిష్కరించాలన్నారు. కచ్చితంగా యూనిఫాంతోనే విధులకు హాజరు కావాలన్నారు. అనంతరం ఆయన మహమ్మదాబాద్ గ్రామంలోని చెత్త సంపద కేంద్రాన్ని పరిశీలించారు.

రైతులకు అవగాహన కల్పించాలి

గోరంట్ల: కంపోస్టు ఎరువుల కలిగే ప్రయోజనాలను రైతులు వివరించి వారు ఉపయోగించేలా చూడాలని కలెక్టర్ చేతన్ అధికారులను ఆదేశించారు. బుధవారం ఆయన గోరంట్ల కూరగాయల మార్కెట్ సమీపంలోని చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలించారు. కాంపోస్టు ఎరువు ఉపయోగాలను రైతులకు వివరించాలన్నారు. అనంతరం సమీపంలోని శుద్ధి జలప్లాంట్ నిరుపయోగంగా ఉండటం చూసి అధికారులపై మండి పడ్డారు. వెంటనే మరమ్మతులు చేసి వినియోగంలోకి తీసుకురావాలని పంచాయతీ ఈఓ బాబురావును ఆదేశించారు.

రోగులకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలి

ఓడీచెరువు: రోగులకు నాణ్యమైన వైద్యసేవలు అందించాలని కలెక్టర్ చేతన్ ఆదేశించారు. బుధవారం ఆయన స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. మందులు, ఓపీ వివరాలు, గ్రామీణులకు అందుతున్న వైద్యసేవలపై డాక్టర్ కమల్ రోహిత్‌తో ఆరా తీశారు. అనంతరం మండల కేంద్రం సమీపంలోని చెత్తనుంచి సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలించారు. పారిశుధ్య కార్మికులకు మరిన్ని సౌకర్యాలను కల్పించాలని ఆదేశించారు.

కొనసాగుతున్న టీడీపీ అరాచకాలు

- నసనకోట ముత్యాలన్న ఇంటిపై పరిటాల వర్గీయుల రాళ్ల దాడి
- ఏలుకుంట్ల సర్పంచ్ తనయుడిపై హత్యాయత్నం


ముత్యాలన్న ఇంటిపై రాళ్లతో దాడి చేసిన దృశ్యం

సాక్షి టాస్క్‌ఫోర్స్: జిల్లాలో టీడీపీ నాయకుల అరాచకాలు కొనసాగుతున్నాయి. అధికారంలోకి వచ్చినప్పటి నుంచి బరి తెగించారు. వైఎస్సార్‌సీపీ మద్దతుదారులపై దాడులు చేయడమే లక్ష్యంగా పెట్టుకున్నారు. భౌతికదాడులతో పాటు ఆస్తులు, వాహనాల విధ్వంసానికి పాల్పడుతున్నారు. ఈ క్రమంలోనే బుధవారం రాత్రి రామగిరి మండలం నసనకోటలో ముత్యాలమ్మ ఆలయ కమిటీ మాజీ చైర్మన్ ముత్యాలన్న ఇంటిపై రాళ్లతో దాడి చేశారు. రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత సొంత పంచాయతీలోనే ఈ ఘటన జరగడం గమనార్హం. ముత్యాలన్న గత ప్రభుత్వ హయాంలో నసనకోట ముత్యాలమ్మ ఆలయ కమిటీ చైర్మన్‌గా పనిచేశారు. పార్టీ కార్యక్రమాల్లోనూ చురుగ్గా వ్యవహరించారు. దీన్ని పరిటాల వర్గీయులు జీర్ణించుకోలేకపోయారు. గత ఎన్నికల సమయంలోనే పరిటాల శ్రీరామ్ 'నీ అంతు చూస్తా' అంటూ ముత్యాలన్నకు వార్నింగ్ ఇచ్చారు. దీంతో కూటమి అధికారంలోకి రాగానే ముత్యాలన్న సొంతూరు వదలి ఇతర ప్రాంతాల్లో తలదాచుకుంటున్నారు. ప్రస్తుతం నసనకోటలోని ఇంట్లో తల్లి, తమ్ముడు మాత్రమే ఉంటున్నారు. పరిటాల వర్గీయులు బుధవారం రాత్రి ఉన్నఫళంగా రాళ్ల దాడికి దిగడంతో వారు భయాందోళనకు గురై..ఇల్లు వదలి వెళ్లిపోయారు. కేవలం ఆధిపత్యం కోసమే పరిటాల వర్గీయులు ఇలా బరి తెగించినట్లు తెలుస్తోంది.

ఏలుకుంట్ల రమేష్‌పై హత్యాయత్నం..

ధర్మవరం రూరల్: మండలంలోని ఏలుకుంట్లకు చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు, సర్పంచ్ మంగమ్మ కుమారుడు రమేష్‌పై బుధవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు హత్యాయత్నం చేశారు. రమేష్ వ్యక్తిగత పని నిమిత్తం బుధవారం ఏలుకుంట్ల నుంచి ధర్మవరం వచ్చారు. రాత్రి ద్విచక్ర వాహనంపై స్వగ్రామానికి వెళుకుండగా.. ఏలుకుంట్ల చెరువు కట్ట వద్ద అప్పటికే దారి కాచిన గుర్తు తెలియని వ్యక్తులు రాళ్లతో దాడి చేశారు. ఊహించని ఘటనతో రమేష్ ద్విచక్ర వాహనాన్ని వేగంగా ముందుకు నడిపి ప్రాణాలు కాపాడుకున్నారు. అప్పటికే రెండు, మూడు రాళ్లు బలంగా తగలడంతో రక్తస్రావమైంది. చీకటి ఉండడంతో తనపై దాడి చేసిన వారిని గుర్తించలేకపోయానని రమేష్ తెలిపారు. గ్రామానికి చెందిన కొందరు తనను చంపాలని చూస్తున్నారన్నారు. దాడి ఘటనపై ధర్మవరం రూరల్ పోలీసులకు ఫోన్ ద్వారా సమాచారం ఇచ్చానన్నారు. తనకు ప్రాణహాని ఉందని, పోలీసులు రక్షణ కల్పించాలని ఆయన కోరారు.


దాడిలో గాయపడిన ఏలుకుంట్ల రమేష్

'స్వచ్ఛతా హీ సేవ'లో అందరూ భాగస్వాములు కావాలి

- అధికారులకు కలెక్టర్ ఆదేశం


వీసీలో మాట్లాడుతున్న కలెక్టర్ టీఎస్ చేతన్

ప్రశాంతి నిలయం: జిల్లా వ్యాప్తంగా ఈ నెల 14 నుంచి అక్టోబర్ 2వ తేదీ వరకూ చేపట్టనున్న 'స్వచ్ఛతా హీ సేవ' కార్యక్రమంలో ప్రజలతో పాటు అధికారులంతా భాగస్వాములు కావాలని కలెక్టర్ టీఎస్ చేతన్ పిలుపు నిచ్చారు. బుధవారం ఆయన, కలెక్టరేట్ నుంచి అన్ని మండలాల ఎంపీడీఓలు, మున్సిపల్ కమిషనర్లు, ఈఓ ఆర్డీలు, పంచాయతీ సెక్రెటరీలు, సంబంధిత అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా 'స్వచ్ఛతా హీ సేవ' కార్యక్రమ లక్ష్యాలు, ప్రణాళికలు వివరించారు. కార్యక్రమాల నిర్వహణకు సంబంధించి పలు సూచనలు చేశారు. పరిసరాల పరిశుభ్రంతో రోగాల వ్యాప్తిని అరికట్టడం సాధ్యమవుతుందని, స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమం ఉద్దేశం కూడా అదేనన్నారు. అందువల్ల అన్ని వర్గాలను కార్యక్రమంలో భాగస్వామ్యులను చేసి విజయవంతం చేయాలన్నారు. ఈ నెల 14 నుంచి 17 వరకు అవగాహన కార్యక్రమాలు, 17 నుంచి అక్టోబర్ 2 వరకు సంపూర్ణ స్వచ్ఛతా కార్యక్రమాలు మున్సిపల్, గ్రామ స్థాయిలో నిర్వహించాలన్నారు. కాన్ఫరెన్స్‌లో డీపీఓ విజయ్‌కుమార్, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

వినాయక లడ్డూ @ రూ.1.40 లక్షలు



లడ్డూ దక్కించుకున్న వారిని సన్మానిస్తున్న దృశ్యం

ధర్మవరం అర్బన్: వినాయక చవితి సందర్భంగా స్థానిక గాంధీనగర్ వినాయక ఉత్సవ సమితి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మంటపం వద్ద బుధవారం లడ్డూ వేలం నిర్వహించారు. రూ.1.40లక్షలకు వేలం పాడి పోలా రామకృష్ణ సొంతం చేసుకున్నారు. అలాగే రెండు వెండి కాయిన్లకు నిర్వహించిన వేలం పాటలో ఒకటి పోలా రామకృష్ణ రూ.37,600, రెండోదానిని చింతా యల్లయ్య రూ.32,500కు దక్కించుకున్నారు. ఈ సందర్భంగా వారిని కమిటీ సభ్యులు జక్కా శింగరయ్య, పరిసే నరసప్ప, చింతా వాసు, దాసరి మురళి ఘనంగా సత్కరించారు.

కొల్లకుంట ఘటనలో ఇరువర్గాలపై కేసుల నమోదు

హిందూపురం అర్బన్/పుట్టపర్తి టౌన్ : వినాయక నిమజ్జనం ఊరేగింపు నేపథ్యంలో కొల్లకుంట గ్రామంలో మంగళవారం జరిగిన టీడీపీ గూండాల ఏకపక్ష దాడికి సంబంధించి బాధ్యులతో పాటు బాధితులపై కూడా పోలీసులు కేసులు నమోదు చేశారు. ఈ మేరకు ఎస్పీ వి.రత్న బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు. వైఎస్సార్‌సీపీ వర్గీయుల్లో ముగ్గురిపై, టీడీపీకి చెందిన మరో ముగ్గురిపై కేసులు నమోదయ్యాయి. కొల్లకుంట ఘటనను తీవ్రంగా పరిగణిస్తూ గ్రామంలో ఎలాంటి గొడవలు లేకుండా పోలీస్ పికెట్ ఏర్పాటు చేశారు.

వివాహిత బలవన్మరణం



గౌతమి (ఫైల్)

పరిగి: జీవితంపై విరక్తితో ఓ వివాహిత ఆత్మహత్య చేసుకున్న ఘటన మూడు రోజులు ఆలస్యంగా వెలుగు చూసింది. వివరాలు... సోమందేపల్లి మండలం బ్రహ్మసముద్రం గ్రామానికి చెందిన నరసింహప్ప కుమార్తె గౌతమి (21)కి పరిగి మండలం గణపతిపల్లికి చెందిన రామాంజినప్పతో వివాహమైంది. కొంతకాలంగా గౌతమిని గణపతిపల్లికి చెందిన ఓ మహిళ వివాహేతర సంబంధం కొనసాగించాలంటూ ఒత్తిడి చేయడం మొదలుపెట్టింది. ఈ క్రమంలో మూడు రోజుల క్రితం గౌతమి కనిపించకుండా పోయింది. ఆమె ఆచూకీ కోసం కుటుంబసభ్యులు గాలించినా ఫలితం దక్కలేదు. దీంతో పోలీసులకు ఫిర్యాదు చేయడంతో మిస్సింగ్ కేసు నమోదైంది. బుధవారం ఉదయంగణపతిపల్లిలోని ఓ నీటి కుంటలో గౌతమి మృతదేహాన్ని గుర్తించిన స్థానికుల సమాచారంతో పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. మృతురాలిని బాధిత కుటుంబసభ్యులు నిర్ధారించారు. ఘటనపై గౌతమి తండ్రి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

ఇక అన్నీ పెయ్య దూడలే

- లింగ నిర్ధారిత వీర్యంతో కృత్రిమ గర్భధారణ
- 90 శాతం పెయ్య దూడల ఉత్పత్తే లక్ష్యం
- రైతులకు అవగాహన కల్పిస్తున్న పశువైద్య శాఖ



శివరంలో రైతులకు అవగాహన కల్పిస్తున్న పశు వైద్యాధికారులు



కృత్రిమ గర్భధారణతో పుట్టిన పెయ్యదూడ

లేపాక్షి: పాడి రైతుల సమస్యకు ఎట్టకేలకు పరిష్కారం లభించింది. పెయ్య (ఆడ) దూడలే కావాలనుకునే వారికి ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో అభివృద్ధి చేసిన లింగ నిర్ధారణ వీర్యం ప్రస్తుతం అందుబాటులోకి వచ్చింది. దేశవాళి ఎద్దులతో జత కట్టించి పాడి ఆవులను గర్భధారణ చేయడం దశాబ్దాల క్రితం నాటి మాట. కొన్ని ప్రాంతాల్లో ఇప్పటికీ ఈ విధానమే కొనసాగుతున్నా... ఎద్దుల సంఖ్య గణనీయంగా తగ్గిన ప్రస్తుత రోజుల్లో ప్రత్యామ్నాయంగా కృత్రిమ గర్భధారణ ఇంజెక్షన్లు అందుబాటులోకి వచ్చాయి.

కావాల్సిన జాతి రకం ఎంచుకోవచ్చు..

పెయ్య దూడలు మాత్రమే పుట్టేలా లింగ నిర్ధారిత వీర్యంతో కృత్రిమ గర్భధారణ పథకంపై పశుసంవర్థక శాఖ అధికారులు విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. ఇందులో భాగంగా పాడి రైతు కోరుకున్న జాతి రకం ఆడ దూడలు పుట్టేలా ఆవులు, గేదెలకు కృత్రిమ గర్భధారణ చేయించుకునే వెసులుబాటు కల్పించారు. జెర్సీ, జెర్సీ క్రాస్, హెచ్‌ఎఫ్, హెచ్‌ఎఫ్ క్రాస్, గిర్, సాహివాల్, ముర్రా (బర్రెలు) మొదలైన మేలు జాతి రకాలను ఎంచుకోవచ్చు. ఎదకు వచ్చిన ఒక్కో ఆవుకు రెండు దఫాలుగా లింగ నిర్ధారణ వీర్యాన్ని అందిస్తారు. రూ. 1,350 విలువ చేసే రెండు సూదులను సబ్సిడీ రూ.850 పోను రూ.500కే రైతులకు సరఫరా చేస్తున్నారు. రెండు సూదులు వేసినా ఎద కట్టకపోతే రైతు చెల్లించిన రూ.500ను వెనక్కు ఇచ్చేస్తారు. ఒక వేళ లేగ (మగ)దూడ పుడితే రూ.250 వెనక్కు చెల్లిస్తారు. ఇప్పటికే పలు గ్రామాల్లో పశుసంవర్ధక శాఖ అధికారులు 90 శాతం కచ్చితత్వంతో కూడిన ఫలితాలు సాధించడంతో కృత్రిమ గర్భధారణపై రైతులు ఆసక్తి చూపుతున్నారు.

ఎంతో ఉపయోగం



పాడి పశువులకు కృత్రిమ గర్భధారణ చేయించే విషయంపై మా గ్రామంలో పశువైద్యాధికారి డాక్టర్ హేమలత అవగాహన కల్పించారు. నేనూ రూ.500 చెల్లించి మా పాడి ఆవుకు రెండు సూదులు వేయించా. మూడు నెలల్లోనే దూడ నిర్ధారణ అయింది. 9 నెలల అనంతరం హెచ్‌ఎఫ్ జాతి పెయ్య దూడ పుట్టింది. పాల దిగుబడి బాగుంది.

– జయరామిరెడ్డి, పాడి రైతు, శివరం, లేపాక్షి మండలం

రైతులకు అవగాహన కల్పిస్తున్నాం



లింగ నిర్ధారిత వీర్యంతో పశువుల్లో కృత్రిమ గర్భధారణ అంశంపై విస్తృత ప్రచారం చేస్తున్నాం. దీనిపై పాడి రైతులకు అవగాహన కల్పిస్తున్నాం. ప్రతి గ్రామంలో పశు గర్భకోశ చికిత్స శిబిరాలు ఏర్పాటు చేసి, ఆసక్తి కనబరిచిన రైతుల పశువులకు కృత్రిమ గర్భధారణ ఇంజెక్షన్లు ఇస్తున్నాం. ఇప్పటి వరకూ 11 మండలాల్లో 200కు పైగా పశువులకు కృత్రిమ గర్భధారణ సూదులు వేశాం.

– డాక్టర్ పెంచలయ్య, డీడీ, పశుసంవర్ధక శాఖ

కారు ఢీకొని యువకుడి మృతి





రమేష్‌నాయక్ మృతదేహాన్ని పరిశీలిస్తున్న మాజీ ఎంపీ రంగయ్య (ఇన్‌సెట్‌లో) మృతుడు రమేష్ నాయక్

కంబదూరు: ఇన్నోవా వాహనం ఢీకొన్న ఘటనలో ఓ యువకుడు దుర్మరణం పాలయ్యాడు. పోలీసులు తెలిపిన మేరకు... గుమ్మఘట్ట మండలం మారెంపల్లి తండాకు చెందిన రమేష్‌నాయక్(28) బుధవారం ఉదయం హిందూపురం నుంచి స్వగ్రామానికి ద్విచక్ర వాహనంపై బయలుదేరాడు. కంబదూరు మండలం కదిరిదేవరపల్లి వద్దకు చేరుకోగానే ఎదురుగా వేగంగా వస్తున్న ఇన్నోవా వాహనం ఢీకొంది. ఘటనలో తీవ్రంగా గాయపడిన రమేష్‌నాయక్‌ను స్థానికులు వెంటనే 108 అంబులెన్స్‌లో కళ్యాణదుర్గంలోని సీహెచ్‌సీకి తరలిస్తుండగా మార్గం మధ్యలోనే మృతి చెందాడు. మృతుడికి భార్యతో పాటు ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఘటనపై ఎస్‌ఐ ఆంజనేయులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు. కాగా, విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ ఎంపీ తలారి రంగయ్య కళ్యాణదుర్గం సీహెచ్‌సీలో ఉన్న రమేష్ నాయక్ మృతదేహాన్ని పరిశీలించారు. బాధిత కుటుంబసభ్యులను ఓదార్చి ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా ఆయన వెంట వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి బోయ తిప్పేస్వామి ఉన్నారు.

సైబర్ గ్రూమింగ్‌పై అప్రమత్తం చేయండి

- ఐసీడీఎస్ పీడీ నాగమల్లేశ్వరి



కరపత్రాలు విడుదల చేస్తున్న నాగమల్లేశ్వరి, తదితరులు

పుట్టపర్తి టౌన్: సైబర్ గ్రూమింగ్ (ఎవరైనా తరచుగా ఆన్‌లైన్ ద్వారా పిల్లలతో స్నేహం చేయడం, లైంగిక వేధింపులు, లైంగిక దోపిడీ, అక్రమ రవాణా)పై పిల్లలను అప్రమత్తం చేయాలని మహిళా పోలీసులు, ఆర్పీలకు ఐసీడీఎస్ పీడీ నాగమల్లేశ్వరి సూచించారు. చిల్డ్రన్ ఆఫ్ ఇండియా ఫౌండేషన్, మహిళాశిశు సంక్షేమ శాఖ, బాలల పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో బుధవారం పుట్టపర్తిలోని ఈశ్వరమ్మ మండల సమాఖ్య కార్యాలయంలో కొత్తచెరువు, పుట్టపర్తి, బుక్కపట్నం మహిళాపోలీసులు, ఆర్పీల సమావేశం జరిగింది. ఐసీడీఎస్ పీడీతో పాటు బాలల పరిరక్షణ అధికారి మహేష్, జిల్లా కో ఆర్డినేటర్ అలెస్కో, ఆనందబాబు మాట్లాడారు. సైబర్ గ్రూమింగ్‌పై పిల్లలను ఎలా చైతన్య పరచాలనే అంశాలను వివరించారు. అనంతరం కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సీఐఎఫ్ జిల్లా ప్రతినిధి కొండప్ప, తదితరులు పాల్గొన్నారు.

మద్యం అక్రమ రవాణా.. ముద్దాయికి మూడేళ్ల జైలు

- రూ.2 లక్షల జరిమానా విధించిన పెనుకొండ కోర్టు

పుట్టపర్తి టౌన్/గోరంట్ల: కర్ణాటక మద్యం అక్రమ రవాణా కేసులో నేరం రుజువుకావడంతో ముద్దాయి షేక్ నూర్‌మహమ్మద్‌కు మూడేళ్ల జైలు శిక్ష, రూ.2 లక్షల జరిమానా విధిస్తూ పెనుకొండ జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ జడ్జి బొజ్జప్ప బుధవారం తీర్పు వెలువరించారు. వివరాల్లోకి వెళితే... వైఎస్సార్ జిల్లా సింహాద్రిపురానికి చెందిన షేక్ నూర్‌మహమ్మద్ 2020 జూలై 18న కర్ణాటక నుంచి మద్యాన్ని అక్రమంగా తీసుకువెళ్తున్నాడు. ఈ క్రమంలోనే అప్పటి గోరంట్ల సీఐ జయా నాయక్ వాహనాలు తనిఖీ చేస్తున్నాడు. అదే సమయంలో అటుగా వచ్చిన షేక్ నూర్ మహమ్మద్ వాహనాన్ని నిలిపి సోదాలు చేశారు. కర్ణాటక మద్యం లభ్యం కావడంతో అతనిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. అనంతరం చార్జ్‌షీట్ దాఖలు చేశారు. ఈ కేసు బుధవారం విచారణకు వచ్చింది. నేరం రుజువుకావడంలో ముద్దాయి షేక్ నూర్ మహమ్మద్‌కు మూడేళ్ల జైలు శిక్ష, రూ.2 లక్షల జరిమానా విధిస్తూ పెనుకొండ జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ జడ్జి బొజ్జప్ప తీర్పు చెప్పారు. ముద్దాయికి శిక్ష పడేలా కేసు వాదించిన ఏపీపీ శ్యామల, సాక్ష్యాలను కోర్టులో ప్రవేశపెట్టిన కానిస్టేబుల్ కరుణాకర్‌రెడ్డి, భాస్కర్‌ను ఎస్పీ రత్న ప్రత్యేకంగా అభినందించారు.

నాటు తుపాకీ కేసులో ఇద్దరి అరెస్ట్



మాట్లాడుతున్న సీఐ శ్రీధర్, ఎస్‌ఐ సుధాకర్‌యాదవ్

రామగిరి: మండలంలోని కుంటిమద్దిలో మంగళవారం చోటుచేసుకున్న ఘటనకు సంబంధించి పోలీసులు ఇద్దరిని అరెస్టు చేశారు. వారి నుంచి నాటు తుపాకీ స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసు వివరాలను బుధవారం సీఐ శ్రీధర్, ఎస్‌ఐ సుధాకర్ యాదవ్ విలేకరులకు తెలిపారు. కుంటిమద్ది పంచాయతీ సుద్దకుంటపల్లికి చెందిన గంగాధర్, కేశవ్‌లు బంధువులు. కొన్నేళ్లుగా ఇద్దరూ కలసి వ్యాపారం చేశారు. తమ రక్షణ కోసం ధర్మవరానికి చెందిన ఆనంద్‌తో నాటుతుపాకీ కొనుగోలు చేశారు. అనంతర కాలంలో వ్యాపారలావాదేవీలు, ఇతర అంశాల్లో ఇరువురి మధ్య విభేదాలు తలెత్తాయి. ఈ నేపథ్యంలోనే మంగళవారం వారివురి మధ్య ఆర్థికలావాదేవీల విషయంలో వాగ్వాదం జరిగింది. మాటామాటా పెరగడంతో గంగాధర్ నాటు తుపాకీ తీసి కేశవ్‌ను బెదిరించాడు. గమనించిన గ్రామస్తులు గంగాధర్‌ను అడ్డుకున్నారు. గ్రామస్తుల సమాచారం బుధవారం గంగాధర్, కేశవ్‌లను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు సీఐ, ఎస్‌ఐ తెలిపారు. నాటుతుపాకీ ఎక్కడి నుంచి వచ్చిందన్న వివరాలు దర్యాప్తులో తేలుతాయన్నారు.

ప్రపంచ దేశాల్లోనే అగ్రగామిగా భారత్‌ను నిలుపుదాం

- సెంట్రల్ యూనివర్సిటీ వీసీ కోరి



సదస్సులో పాల్గొన్న యూనివర్సిటీ విద్యార్థులు

బుక్కరాయసముద్రం: ప్రపంచ దేశాల్లోనే భారత దేశాన్ని అగ్రగామిగా నిలిపేలా ప్రధాని మోదీ కృషి చేస్తున్నారని సెంట్రల్ యూనివర్సిటీ ఉప కులపతి ప్రొఫెసర్ కోరి అన్నారు. బీకేఎస్ మండలం జంతలూరులో ఉన్న సెంట్రల్ యూనివర్సిటీలో సెమికాన్ ఇండియా–2024 సదస్సు నిర్వహించారు. ప్రధాని మోదీ వర్చువల్ విధానంలో పాల్గొని ప్రసంగించారు. అనంతరం వీసీ కోరి, వర్సిటీ డీన్ డాక్టర్ ప్రొఫెసర్ షీలారెడ్డి మాట్లాడుతూ.. సెమీ కండక్టర్ పరిశ్రమలో ప్రస్తుత పోకడలను విద్యార్థులకు తెలియజేయడానికి ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ డేటా సైన్స్ విభాగం ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తెలిపారు. సెమికండక్టర్ డిజైన్‌లో సాంకేతికంగా భారతదేశాన్ని ప్రపంచ దేశాల్లోనే అగ్రగామిగా ఉంచడమే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు తెలిపారు. 250 మందికి పైగా ఎగ్జిబిటర్లు, 150 మంది స్పీకర్లు ఈ సదస్సులో పాల్గొన్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ డేటా సైన్స్ విభాగాధిపతి డాక్టర్ కృష్ణప్రియ, ప్రొఫెసర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆయుధాలతో యువకుల హల్‌చల్



పోలీసులు స్వాధీనం చేసుకున్న కత్తి, పిస్తోల్

మడకశిర: మండలంలోని గుండుమలలో మంగళవారం రాత్రి గణేష్ నిమజ్జనం సందర్భంగా ఆయుధాలతో యువకులు హల్‌చల్ చేశారు. వివరాలను సీఐ రాజ్‌కుమార్ బుధవారం ఓ ప్రకటనలో వెల్లడించారు. గ్రామానికి చెందిన కొందరు యువకులు తల్వార్ (కత్తి), తుపాకీతో హల్‌చల్ చేస్తూ గణేష్ నిమజ్జనంలో పాల్గొన్నారు. ఆయుధాలతో వారు సాగించిన విన్యాసాలు చూసి భయభ్రాంతులకు గురైన ప్రజల సమాచారం మేరకు పోలీసులు అక్కడకు చేరుకుని సదరు యువకులను అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి కత్తితో పాటు, తుపాకీని స్వాధీనం చేసుకున్నారు. విచారణ అనంతరం యువకులపై కేసు నమోదు చేయడంతో పాటు తల్లిదండ్రులకు కౌన్సిలింగ్ ఇచ్చారు. కాగా, ఈ ఘటనపై లోతైన దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

పీఏబీఆర్‌లో పెరుగుతున్న నీటి మట్టం

కూడేరు: మండలంలోని పెన్నహోబిలం బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ (పీఏబీఆర్)లో నీటి మట్టం క్రమంగా పెరుగుతోంది. ఎగువన ఉన్న తుంగభద్ర జలాశయం నుంచి హెచ్చెల్సీ ద్వారా 459 క్యూసెక్కులు, జీడిపల్లి రిజర్వాయర్ నుంచి హెచ్‌ఎన్‌ఎస్‌ఎస్ కెనాల్ ద్వారా 44 క్యూసెక్కులు చొప్పున నీరు వచ్చి చేరుతోంది. బుధవారం నాటికి పీఏబీఆర్‌లో 2.018 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు ఇరిగేషన్ జేఈఈ లక్ష్మీదేవి తెలిపారు. అనంత, ఉరవకొండ, కూడేరు, సత్యసాయి, శ్రీరామరెడ్డి తాగునీటి ప్రాజెక్టులకు రోజుకు 60 క్యూసెక్కుల నీరు విడుదల చేస్తున్నట్లు పేర్కొన్నారు.



ప్రాక్టీస్ చేస్తున్న క్రికెటర్లు





పిచ్‌ను పరిశీలిస్తున్న క్రికెటర్లు, మ్యాచ్ రెఫరీతో మాట్లాడుతున్న ఆర్డీటీ ప్రోగ్రాం డైరెక్టర్ మాంఛో ఫెర్రర్

నేటి నుంచి రెండు మ్యాచ్‌లు

- ఇండియా బీ జట్టులో రింకూసింగ్‌కు చోటు

అనంతపురం: అనంత క్రీడాగ్రామం వేదికగా గురువారం నుంచి దులీప్ ట్రోఫీ మ్యాచ్‌లు రెండేసి చొప్పున జరుగనున్నాయి. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లను నిర్వాహకులు పూర్తి చేశారు. కాగా, టీమిండియా విధ్వంసకర ఆటగాడు రింకూసింగ్ మళ్లీ రెడ్‌బాల్ ఆడేందుకు సిద్ధమయ్యాడు. దులీప్ ట్రోఫీ–2024లో ఇండియా–బీ జట్టు తరఫున అతను ప్రాతినిథ్యం వహించనున్నాడు. కాగా, ఇండియా – బీ జట్టులోని యశస్వి జైస్వాల్, రిషబ్‌పంత్, యశ్‌దయాల్ బంగ్లాతో టెస్ట్ సిరీస్‌కు ఎంపికయ్యారు. దీంతో రింకూసింగ్‌తో పాటు ఉత్తరప్రదేశ్ ఆటగాడు ఆకిబ్‌ఖాన్‌కు దులీప్ ట్రోఫీలో ఆడే అవకాశం దక్కింది. ఇప్పటికే అనంతపురానికి చేరుకున్న రింకూసింగ్ బుధవారం మీడియాతో మాట్లాడుతూ... దులీప్ ట్రోఫీలో ఆడేందుకు అవకాశం వచ్చినందుకు చాలా ఆనందంగా ఉందన్నాడు. మొదట జట్లను ప్రకటించినప్పుడు తన పేరు జాబితాలో లేదని, ఇప్పుడు పిలుపు రావడంతో సంతోషంగా ఉందన్నాడు. కాగా, గురువారం నాడు గ్రౌండ్–ఏలో ఇండియా–ఏ, డీ జట్లు తలపడనున్నాయి. అలాగే గ్రౌండ్–బీలో ఇండియా–బీ, సీ జట్ల మధ్య మ్యాచ్ జరగనుంది.

రైలు ఢీకొని వృద్ధుడి మృతి



పెనుకొండ: స్థానిక నగర పంచాయతీ పరిధిలోని వెంకటరెడ్డి పల్లి సమీపంలో బుధవారం రైలు ఢీకొని ఓ గుర్తు తెలియని వృద్ధుడు మృతి చెందాడు. విషయం తెలుసుకున్న జీఆర్పీ ఎస్‌ఐ బాలాజీనాయక్ అక్కడకు చేరుకుని పరిశీలించారు. రైలు వస్తున్న విషయం గమనించని వృద్ధుడు పట్టాలు దాటే ప్రయత్నం చేశాడని, అప్పటికే సమీపంలోకి దూసుకొచ్చిన రైలు ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందినట్లు ప్రాథమిక విచారణలో నిర్ధారణ అయింది. కాగా, మృతుడి వద్ద ఎలాంటి ఆధారాలు లభ్యం కాకపోవడంతో గుర్తు తెలియని వ్యక్తి మృతి కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు రైల్వే పోలీసులు తెలిపారు. ఆచూకీ తెలిసిన వారు 94407 04699కు సమాచారం అందించాలని కోరారు.

రియల్ ఎస్టేట్ వ్యాపారి ఆత్మహత్య



మృతుడు రజనీబాబు

ధర్మవరం అర్బన్: కుమారుడి మృతిని మరువలేక ఏడాది తర్వాత అదే రోజు తండ్రి ఆత్మహత్య చేసుకున్నాడు. వివరాలు.... ధర్మవరంలోని ప్రియాంక నగర్‌లో నివాసముంటున్న రియల్ ఎస్టేట్ వ్యాపారి రజనీబాబు (50), రామాంజినమ్మ (అగళి పీహెచ్‌సీలో స్టాఫ్‌నర్సు) దంపతులకు మణిపాల్ అనే కుమారుడు ఉండేవాడు. గత ఏడాది వినాయక చవితి నాడు మణిపాల్ ఈతకు వెళ్లి నీట మునిగి చనిపోయాడు. అప్పటి నుంచి కుమారుడి జ్ఞాపకాల్లోనే జీవిస్తూ వచ్చిన రజనీబాబు... ఏడాది తర్వాత తన ఇంట్లోనే బుధవారం ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. విషయం తెలుసుకున్న వన్‌టౌన్ పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలలించి, కేసు నమోదు చేశారు.

ఊరగాయ, మసాలా పౌడర్ తయారీపై శిక్షణ

అనంతపురం: పచ్చళ్లు, ఊరగాయ, మసాలా పౌడర్, అప్పడాల తయారీపై నిరుద్యోగ మహిళలకు రూడ్‌సెట్ సంస్థలో ఉచిత శిక్షణ ఇవ్వనున్నారు. ఈ మేరకు ఆ సంస్థ డైరెక్టర్ ఎస్.విజయలక్ష్మి బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఈ నెల 19 నుంచి 10 రోజుల పాటు శిక్షణ కార్యక్రమం ఉంటుంది. శిక్షణాకాలంలో ఉచిత వసతి, భోజన సదుపాయం కల్పిస్తారు. ఉమ్మడి అనంతపురం జిల్లాకు చెందిన 19 నుంచి 45 సంవత్సరాల వయస్సు గల నిరుద్యోగ మహిళలు అర్హులు. పూర్తి వివరాలకు 94409 05479లో సంప్రదించవచ్చు.

గణేష్ నిమజ్జనంలో అపశ్రుతి



సగానికి విరిగిన విగ్రహం

తాడిపత్రి అర్బన్: గణేష్ నిమజ్జనంలో అపశ్రుతి చోటు చేసుకుంది. తాడిపత్రిలో బుధవారం వినాయక ప్రతిమలను నిమజ్జనానికి తరలిస్తుండగా విద్యుత్ తీగలు తగిలి విగ్రహం సగానికి విరిగిపడింది. సాయంత్రం 5గంటల ప్రాంతంలో చేనేత కాలనీ నుంచి అశోక్ పిల్లర్ వైపుగా పెట్రోల్ బంక్ వద్ద ఈ ఘటన చోటు చేసుకుంది. ఘటనలో లారీ వెనుక ఉన్న ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. వీరిలో పరిస్థితి విషమంగా ఉన్న ఒకరిని అనంతపురానికి రెఫర్ చేశారు.

తెల్లారితే పెళ్లి.. ప్రమాదంలో పెళ్లికొడుకుకు గాయాలు

అనంతపురం: నగర పరిధిలోని టీవీ టవర్ సమీపంలో జరిగిన చోటు చేసుకున్న ప్రమాదంలో ముగ్గురికి గాయాలయ్యాయి. వీరిలో ఒకరు పెళ్లికొడుకు ఉన్నారు. వివరాలు.. బత్తలపల్లి మండలం లింగారెడ్డిపల్లికి చెందిన ఈశ్వరయ్య, తరుణ్ బుధవారం సాయంత్రం ద్విచక్ర వాహనంపై అనంతపురానికి వస్తూ టీవీ టవర్ సమీపంలోకి చేరుకోగనాఏ ఎదురుగా వస్తున్న రంగస్వామి బైక్‌ను ఢీకొన్నారు. ఘటనలో ముగ్గురూ కిందపడి గాయపడ్డారు. క్షతగాత్రుల్లో ఈశ్వరయ్యకు గురువారం పెళ్లి జరగాల్సి ఉంది. పెళ్లికొడుకు దుస్తులు తీసుకెళ్లేందుకు వస్తూ ప్రమాదానికి లోనయ్యారు. తరుణ్‌కు కాలు విరిగింది. ఈశ్వరయ్యకు స్వల్ప గాయాలయ్యాయి.

17న పారామెడికల్ కోర్సులకు అడ్మిషన్లు

అనంతపురం మెడికల్: ఈ నెల 17న ఉదయం 11 గంటలకు ప్రభుత్వ వైద్య కళాశాల (జీఎంసీ)లో పారా మెడికల్ కోర్సులకు రెండో విడత అడ్మిషన్లు చేపట్టనున్నారు. ఈ మేరకు జీఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ మాణిక్యరావు బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు. డీఎంఎల్‌టీ, డీఓఏ, డీఏఎన్‌ఎస్, డీఎంఐటీ, డీఈసీజీ, డీడీఆర్‌ఏ తదితర కోర్సులకు అడ్మిషన్లు ఉంటాయి.

రేషన్ బియ్యం పట్టివేత

బొమ్మనహాళ్: అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకుని, వాహనాన్ని సీజ్ చేసినట్లు బొమ్మనహాళ్ ఎస్‌ఐ నబీరసూల్ తెలిపారు. వివరాలను ఆయన వెల్లడించారు. ముందస్తు సమాచారంతో అప్రమత్తమైన పోలీసులు బుధవారం ఉదయం కల్లుదేవనహళ్లి బ్రిడ్జి వద్ద వాహన తనిఖీలు చేపట్టారు. ఆ సమయంలో అటుగా వచ్చిన బొలెరో వాహనాన్ని ఆపి తనిఖీ చేయడంతో 47 బస్తాల్లో (ఒక్కో బస్తాలో 50 కిలోలు) తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. వాహనాన్ని సీజ్ చేసి స్టేషన్‌కు తరలించారు. కాగా, విడపనకల్లు మండలం పాల్తూరు గ్రామానికి చెందిన చంద్రశేఖర్, రామకృష్ణ, బొజ్జిరెడ్డి, బొమ్మనహాళ్ మండలం ఉప్పరహాళ్ గ్రామానికి చెందిన గంగాధర వివిధ గ్రామాల్లో లబ్ధిదారుల నుంచి రేషన్ బియ్యాన్ని కొనుగోలు చేసి బళ్లారికి అక్రమంగా తరలించి సొమ్ము చేసుకుంటున్నట్లుగా నిర్ధారణ కావడంతో నలుగురిపై పోలీసులు కేసు నమోదు చేశారు.